సాక్షి
వరంగల్
గురువారం । 26 । జనవరి । 2023



పచ్చని సిరి.. పర్వతగిరి
ఓవైపు ఆధ్యాత్మికం.. మరోవైపు ఆహ్లాదం. ఇంకోవైపు పర్యాటకం. ఇలా పచ్చని సిరిగల పర్వతగిరి భక్తులను, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. - 8లో▸



ఘనంగా శుద్ధి పండుగ
మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి శుద్ధి పండుగ పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0°/17.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కాశిబుగ్గ సెంటర్: నెక్కొండ మండలం వెంకటాపూర్ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఎం.వీరన్నను సస్పెండ్ చేస్తూ డీఈఓ వాసంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయుడు నిద్రిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు షోకాజ్ నోటీసు జారీ చేయడంతోపాటు ఎంఈఓతో విచారణ నివేదిక తెప్పించినట్లు పేర్కొన్నారు. దీనిపై ఉపాధ్యాయుడి సంజాయిషీ కూడా కోరామని, అది సంతృప్తికరంగా లేకపోవడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

సోలార్ విద్యుత్ ఎంతో మేలు

● రెడ్కో జిల్లా మేనేజర్ మహేందర్‌రెడ్డి



గీసుకొండ: సోలార్ విద్యుత్ ద్వారా వీధిలైట్ల ఏర్పాటుతోపాటు ఇళ్లకు సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) జిల్లా మేనేజర్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మరియపురం గ్రామంలో చేపడుతున్న సోలార్ విద్యుత్ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. సోలార్ గ్రిడ్‌లు, బ్యాటరీ సిస్టం ద్వారా సోలార్ వీధిలైట్ల ఏర్పాటు, స్త్రీనిధి రుణాల ద్వారా పలు కుటుంబాలు సోలార్ విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి ముందుకు రావడం వంటి విషయాలను ఆయన పరిశీలించారు. సోలార్ విద్యుత్‌తో కరెంటు బిల్లుల ఖర్చు ఆదాతోపాటు మిగులు సోలార్ ఎనర్జీని అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ అల్లం బాలిరెడ్డి ఆయనకు పనుల వివరాలపై వివరించగా.. పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

నేడు జెడ్పీలో గణతంత్ర వేడుకలు

వరంగల్ రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ సీఈఓ సాహితీ మిత్ర గురువారం ఉదయం 8.40 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని జెడ్పీ సూపరింటెండెంట్ ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

మార్కెట్ చైర్ పర్సన్‌గా ఎస్సీ మహిళ!

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఈసారి ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యే అవకాశం ఉంది. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సబార్డినేటర్ రూల్స్ ప్రకారం మార్కెట్ చైర్మన్, చైర్ పర్సన్లకు రొటేషన్ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేసింది. దీంతో వరంగల్ మార్కెట్‌కు మొదటి విడత లాటరీ ప్రకారం బీసీ, రెండో దఫా బీసీ, మూడోసారి చైర్మన్‌గా బీసీలను నియమించారు. ఈసారి ఎస్సీ మహిళను చైర్ పర్సన్‌గా నియమించాల్సి ఉంది. అయితే దిడ్డి భాగ్యలక్ష్మి చైర్‌పర్సన్‌గా ఉన్న పాలకవర్గం పదవీకాలం 2022, ఆగస్టు 17తో ముగిసింది. తిరిగి ఆ పాలకవర్గాన్ని 2023, ఫిబ్రవరి 17 వరకు మొదటి విడతగా ఆరునెలలు పొడిగించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ



కాశిబుగ్గ సెంటర్: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని ఖిలా వరంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలేంద్రకుమార్ అన్నారు. మామునూరు విమానాశ్రయంలో నాల్గవ తెలంగాణ వాయు విభాగం కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ సాజల్ కుద్దు ఆధ్వర్యంలో ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హన్సిక గౌడ్, ఎం.శివాని, మహేక్, లక్క సిద్దేశ్వర్, బైరబోయిన అజయ్‌లతోపాటు వివేకానంద హైస్కూల్, వరంగల్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు విమానం నడపడంలో శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శైలేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విమానం నడపడంలో శిక్షణ తీసుకోవడం ఎన్‌సీసీ విద్యార్థులకు గొప్ప అనుభూతి అని అన్నారు. కార్యక్రమంలో థర్డ్ ఆఫీసర్ చింతం నాగరాజు, కేర్ టేకర్లు శ్రీనివాస్, తిరుమల్, జూనియర్ వారెంట్ ఆఫీసర్లు భరద్వాజ్, జైసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులొచ్చేనా..!?

గత బడ్జెట్‌లో కేటాయించినా.. అరకొరగానే విడుదల

- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు, నిధుల అవసరంపై ఆరా
- బడ్జెట్ ఎస్టిమేషన్‌లు సమర్పించిన ఇరిగేషన్ అధికారులు
- దేవాదుల, కాళేశ్వరం, ఎస్సారెస్పీ-2 తదితరాలకు ప్రతిపాదన
- సుమారు రూ.2,580కోట్లు అవసరమని అంచనాలు?
- 2023-24 బడ్జెట్‌పైన ఆశలు.. నిధులు పారితేనే ప్రాజెక్టులు పూర్తి



సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కీలకమైంది. అందులో ఉమ్మడి వరంగల్ మేడిగడ్డ కేంద్రంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. జేసీఆర్ దేవాదుల, పీవీ కంతనపల్లి ప్రాజెక్టులు ప్రాధాన్యతగా తీసుకున్నవే. ఎస్సారెస్పీ స్టేజ్-2తోపాటు చిన్ననీటి వనరుల కోసం గతేడాది బడ్జెట్‌లో కేటాయించినా.. ఆ మేరకు విడుదల కాలేదు. ఎన్నికల ఏడాది కావడంతో వచ్చే నెల అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ సాగునీటి ప్రాజెక్టులకు నిధుల పారుదలపై ఆశలు రేకెత్తుతున్నాయి.

నిధులు పారితేనే పూర్తయ్యేది...

ఉమ్మడి వరంగల్‌లోని ప్రాజెక్టులకు గడచిన మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఆశించిన స్థాయిలో రాలేదు. జిల్లా జలవనరుల శాఖ అధికారులు ఏటా పెద్ద ఎత్తున నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నా 35 శాతం కూడా కేటాయించడం లేదు. దీంతో ప్రాజెక్టు పెండింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం, జేసీఆర్ దేవాదుల, పీవీఆర్ కంతనపల్లి, ఎస్సారెస్పీ-2లతోపాటు మిగిలిన ప్రాజెక్టుల పరిధిలో సుమారు 7.98 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. పెండింగ్ పనులు పూర్తయితే 9.97 లక్షల ఎకరాలకు సాగునీరు పారుతుందని అధికారుల అంచనా. 2004లో రూ.6,084 కోట్లున్న దేవాదుల అంచనా వ్యయం 2020 జూన్ నాటికే రూ.14,945 కోట్లకు పైగా పెరిగింది. ఐదేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 19 ఏళ్లవుతున్నా పూర్తి కావడం లేదు. గతేడాది రూ.2,506.24కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా 25 శాతం కూడా విడుదల చేయలేదు. కాళేశ్వరం మూడో టీఎంసీ, కంతనపల్లి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టులది ఇదే పరిస్థితి.

రుణాలతో నెట్టుకొస్తున్నా..

ఎన్నో ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న కొత్తగా చేపట్టిన ఐదు ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేందుకు తెలంగాణ జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకోవడానికి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన శ్రీరామసాగర్ వరద కాలువ, దేవాదుల, సమ్మక్క బ్యారేజీలు కూడా ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్(ఆర్‌ఇసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ)ల నుంచి ఈ ఐదు ప్రాజెక్టులకు రూ.19,842.53కోట్ల రుణం ఇచ్చేలా ఒప్పందం జరిగింది. రూ.14,253కోట్లు బ్యాంకులు ఇచ్చాయి. మరో రూ.5,388కోట్లు విడుదల దశలో ఆగిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడింది.

ఈసారి భారీగా ప్రతిపాదనలు

అదనపు ఆయకట్టుకు సాగునీరు అందాలంటే ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాల్వలు, తూములు, పిల్ల కాల్వలు, వంతెనలు, పాత కాల్వలు మరమ్మతులు చేయాలి. మూడో టీఎంసీ, దేవాదుల, ఎస్సారెస్పీ-2 భూసేకరణ, పరిహారం వంటి సమస్యలను పరిష్కరించాలి. దీనికి నిధులు భారీగానే అవసరం. 2023-24 బడ్జెట్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు ఏ మేర అవసరమో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి జిల్లాలోని ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు సుమారు రూ.2,580కోట్లు అవసరం ఉంటాయని ప్రతిపాదించినట్లు సమాచారం.

మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

ప్రాజెక్టు	2020-21	2021-22	2022-23
కాళేశ్వరం ప్రాజెక్టు	805.478	918.00	2,506.24
జేసీఆర్ దేవాదుల	77.47	84.09	339.98
పీవీఆర్ కంతనపల్లి	73.83	21.02	42.51
ఎస్సారెస్పీ-2	61.40	11.00	20.00
పాకాల సరస్సు	0.41	6.02	7.50
రామప్ప	0.81	1.50	7.50
లక్నవరం	0.41	0.70	0.75
మల్లూరువాగు	0.31	0.45	2.00

దేవాదుల కాల్వల పూర్తికి ఇంకెన్నాళ్లు



దేవాదుల ప్రాజెక్టు కింద కొన్ని ప్రాజెక్టులు, ట్యాంకులు పూర్తి చేయాల్సి ఉంది. జనగామ జిల్లాలో భూసేకరణతోపాటు మెయిన్ కెనాల్స్, ఫీల్డ్ చానల్స్ పూర్తి చేయడానికి డబ్బులు లేకపోవడమే కారణం. తాత్కాలికంగా చెరువులు నింపి చేతులు దులుపుకుంటున్నారు. కాలువల కింద పంటలు సాగైనప్పుడే ప్రభుత్వం ఆశించిన మేర లక్ష్యం నెరవేరుతుంది. వెంటనే భూ సేకరణకు, కాల్వల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలి.

– సీహెచ్.రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జనగామ

కరువు ప్రాంతాల్లోనే పెండింగ్ పనులు



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కరువు ప్రాంతాలైన జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, చుట్టుపక్కల నియోజకవర్గాలలో పనులు నిధులు లేక నిలిచిపోయాయి. సాగునీటితో సస్యశ్యామలం కావాలంటే ఏకైక మార్గం దేవాదుల పూర్తిస్థాయిలో నిర్మాణం చేయడం. కానీ ప్రతిసారి బడ్జెట్‌లో సరైన కేటాయింపు లేకపోవడం వల్ల గడిచిన 19 సంవత్సరాల నుంచి దేవాదుల ప్రాజెక్టు నీరు అందని ద్రాక్షగానే ఉండిపోయింది.

– బేజాటి బీరప్ప, చార్టర్డ్ అకౌంటెంట్

ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి..



చాలా ప్రాజెక్టులు నిధుల కొరతతో అసంపూర్తిగా ఉన్నాయి. దేవాదుల గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తిగా చేసి ఎగువ ప్రాంత రైతాంగాన్ని ఆదుకునేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వం ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాలి. వరంగల్ మహానగరంలో ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను నెలకొల్పేందుకు నిధులు ఇవ్వాలి.

– కర్రె భిక్షపతి, జిల్లా కార్యదర్శి, సీపీఐ, హనుమకొండ

గణతంత్ర వేడుకలకు సిద్ధం



ముస్తాబైన కలెక్టర్ కార్యాలయం



కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదిక

కరీమాబాద్: వరంగల్ కలెక్టర్ కార్యాలయ భవనం గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. మొన్నటి వరకు వేడుకలు ఎక్కడ నిర్వహించాలనే సందేహాలున్నా ప్రభుత్వం కలెక్టరేట్లలోనే నిర్వహించాలని మంగళవారం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి అధికారులతో కలిసి ఆవరణను పరిశీలించారు. వేదిక ఏర్పాటుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేసే కార్యక్రమం నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. దీంతో ఆయా విభాగాల అధికారులు బుధవారం వేదిక ఏర్పాటుతోపాటు జెండాల ఏర్పాటు తదితర పనులు పూర్తి చేశారు.

రైతులు చిరుధాన్యాలు పండించాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్



మాట్లాడుతున్న ఉషాదయాళ్

నర్సంపేట రూరల్: రైతులు చిరుధాన్యాల పంటలు సాగుచేసి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి రైతు వేదిక వరకు 150 మంది రైతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉషాదయాళ్ మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రతీ ఒక్కరు చిరుధాన్యాల ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారని అన్నారు. రైతులు చిరుధాన్యాల సాగులో మెళకువలు పాటించి చీడపీడల నివారణను తగ్గించుకోవాలన్నారు. ఆయా పంటలను సాగుచేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం చిరుధాన్యాలను ప్రదర్శించారు. మహర్షి గోశాల వారి సహకారంతో రైతులకు 5 ఆవులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త నర్సయ్య, జిల్లా ప్రణాళికాధికారి జీవరత్నం, ఎంపీపీ మోతె కళావతి పద్మనాభరెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు అవినాష్ వర్మ, ఏసీడీపీఓ విద్య, మహర్షి గోశాల నిర్వాహకులు తీరాం యుగేందర్, గడ్డం అశోక్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ మోతె జయపాల్‌రెడ్డి, నల్ల భారతి, డివిజన్‌లోని ఆరు మండలాల వ్యవసాధికారులు, విస్తర్ణాధికారులు పాల్గొన్నారు.

'ఐ మిస్ యూ' అంటూ మహిళ ఆత్మహత్య



వినీత (ఫైల్)

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన పశుసంవర్ధక శాఖలో బొల్లికుంట వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ల్యాదల్ల వినీత(40) ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ఉరివేసుకోగా.. సాయంత్రం వరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం . వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్(సాల్మన్), వినీత ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉండగా.. ఆరు నెలల క్రితం ప్రభాకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఇదిలా ఉండగా.. వినీత కొంత కాలంగా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా.. ఇద్దరి మధ్య ఇటీవల మనస్పర్ధలు వచ్చాయని, సదరు వ్యక్తి ఆమెకు ఫోన్ చేయడం లేదని, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు. ఆమె సెల్ ఫోన్‌లో 'ఐ మిస్ యూ' అనే సందేశం ఉందని, ఈ క్రమంలోనే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెబుతున్నారు. గీసుకొండ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. దీనిపై మృతురాలి బంధువులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి





ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ గోపి. పక్కన అదనపు కలెక్టర్ శ్రీవత్స, ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

● కలెక్టర్ గోపి

కరీమాబాద్: అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ గోపి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా అధికారులందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో అందరికీ ఓటు హక్కు లేదని, కేవలం చదువుకున్న, పన్నులు చెల్లించే వారికి, ఉన్నత స్థానాల్లో ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు ఉండేదన్నారు. అయితే రాజ్యాంగం ఏర్పడిన తర్వాత అందరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా మనం ఓటరుగా ఉన్నామని చెబుతూ.. ఓటు హక్కు లేకుంటే పోరాడే దుస్థితి ఉండేదని పేర్కొన్నారు. వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడాన్ని తమ కర్తవ్యంగా భావించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, తారతమ్యాలు లేకుండా నిజాయితీతో ఓటు వేసినప్పుడే ఓటుకు సార్థకత చేకూరుతుందన్నారు. ఇదిలా ఉండగా.. ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వివిధ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసి ఫారం బీ-6లో వంద శాతం సాధించిన దేశాయిపేట, ఖిలా వరంగల్ బీఎల్‌ఓలకు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఈఓ వాసంతి, ఆర్డీఓ మహేందర్‌జీ, నోడల్ అధికారి నర్సింహమూర్తి, వివిధ శాఖల అధికారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన 'వానాకాలం' కొనుగోళ్లు

- జిల్లాలో 1,66,132 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతులకు ఇంకా చెల్లించాల్సింది రూ1.49కోట్లు

సాక్షి, వరంగల్: జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా 2,30,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినా.. 1,66,132 మెట్రిక్ టన్నులు మాత్రమే పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు రూ.339కోట్లు చెల్లించింది. మరో రూ.1.49కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. సాధ్యమైనంత వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయడంపై పౌరసరఫరాల అధికారులు దృష్టి సారించారు. అయితే కొనుగోలు కేంద్రాలు కాస్త ఆలస్యంగా ప్రారంభం కావడంతోపాటు పెట్టుబడుల కోసం రైతులు ముందుగానే ధాన్యాన్ని బయటి వ్యాపారులకు విక్రయించారు. దీంతో ఈసారి అనుకున్నదానికంటే 60వేల మెట్రిక్ టన్నులకుపైగా తగ్గిందని అధికారులు అంచనా వేశారు. 188 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో సరైన సమయానికి డబ్బులు జమ అయ్యేలా చూశారు. వివిధ కారణాలతో కొందరి డబ్బులు ఆలస్యమైనా వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి.

ఇంకా రూ.1.49కోట్లు ఇవ్వాలి..

తొలుత 197 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు భావించినా.. 186 కేంద్రాలకు మాత్రమే పరిమితమయ్యారు. దాదాపు నెలన్నరపాటు సాగిన కొనుగోళ్ల ద్వారా 1,66,132 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు పంపారు. 'కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల వివరాలు అప్‌డేట్ చేసి కాంటా పెట్టాం. లారీల్లో ధాన్యం రవాణాకు ఇబ్బందులు కలగకుండా చూశాం. ఎక్కడా ఎటువంటి అవకతవకలు లేకుండా సక్రమంగా కొనుగోలు చేసేలా చూశాం. సంబంధిత మిల్లులకు చేరవేశాం. బుధవారంతో అన్ని కొనుగోలు కేంద్రాలు మూసివేశాం. ఇంకా చెల్లించాల్సిన రూ.1.49కోట్ల ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తవుతుంది' అని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి గౌరీశంకర్ తెలిపారు.

పథకాలతో అభివృద్ధి చెందాలి

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. పక్కన కలెక్టర్ గోపి. అదనపు కలెక్టర్ వాకడే

రాయపర్తి: మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలని, వారు ఆర్థిక సాధికారత సాధించినప్పుడే కుటుంబాలు బాగుపడతాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీనిధి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ గోపితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను ఆనాడు ఎన్టీఆర్ చైతన్యం చేస్తే.. నేడు సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్నారన్నారు. కేసీఆర్ అనేక పథకాలను దూరదృష్టితో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పింఛన్ రూ.500 చొప్పున ఇస్తుంటే.. మన రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2వేలు ఇస్తుందన్నారు. మహిళలు కుట్టుశిక్షణ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పర్వతగిరిలో కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయాన్ని పునరుద్ధరించామని, ఈనెల 27, 28న ప్రారంభోత్సవానికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వర్ణభారతి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు అమరావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, డీపీఎం అనిత, సరిత, భవాని, సైదిరెడ్డి, ఏపీఎం అశోక్, సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

● కలెక్టర్ గోపి




కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

వర్ధన్నపేట: కంటి వెలుగు పరీక్షల కోసం కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ గోపి అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని మూడో వార్డు ఎస్‌పీజీ చర్చి ప్రాంగణంలో కొనసాగుతున్న కంటి పరీక్షల శిబిరాన్ని కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. శిబిరంలో పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారు.. కంటి అద్దాలు అందిస్తున్నారా.. మందులు పంపిణీ చేస్తున్నారా.. అని పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడారు. కంటి అద్దాలు అందని వారికి ఇళ్ల వద్దకు వెళ్లి ఇవ్వాలన్నారు. అందుబాటులో ఉన్న అద్దాలు పరీక్షలు కాగానే వారికి అందజేయాలన్నారు. 18 ఏళ్లు పైబడిన వారందరికి కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, కమిషనర్ గొడిశాల రవీందర్, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఇండియన్ పోలీస్ మెడల్

- వరంగల్ సీపీగా పనిచేసిన తరుణ్‌జోషి, టీఎస్ఎస్పీ ఆర్ఐ దయాశీల ఎంపిక
- పనిలో నిబద్ధత, సేవకు తగిన గుర్తింపు



తరుణ్‌జోషి



దయాశీల

వరంగల్‌క్రైం/మామునూరు: పోలీస్‌శాఖలో విశిష్ట సేవలు అందించినందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు అధికారులకు ఇండియన్ పోలీస్ మెడల్(ఐపీఎం) దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ అవార్డులను ప్రకటించింది. అందులో ఒకరు ఇటీవల బదిలీ అయిన వరంగల్ పోలీస్ కమిషనర్ పి.తరుణ్ జోషి కాగా, మరొకరు మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ఆర్ఐ కారుకొండ దయాశీల.

గంజాయి రహితంగా మార్పునకు కృషి

వరంగల్ సీపీగా పనిచేసిన తరుణ్‌జోషికి కేంద్ర ప్రభుత్వం పోలీస్ మెడల్ ప్రకటించింది. 2021 ఏప్రిల్ 7 నుంచి 2022 డిసెంబర్ 2 వరకు సీపీగా పనిచేసిన డాక్టర్ తరుణ్‌జోషి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నివారణకు కృషి చేశారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాల నుంచి కమిషనరేట్ మీదుగా రవాణా అవుతున్న గంజాయిని అరికట్టడంతోపాటు భారీ ఎత్తున పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. మత్తు పదార్థాలకు బానిసలైన యువతను సన్మార్గంలో పెట్టడానికి నయా కిరణ్ పేరుతో రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విముక్తి కల్పించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలు,సైబర్ క్రైం నేరాలు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 'వరంగల్‌లో చేసిన కార్యక్రమాలకు ఐపీఎం అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది' అని తరుణ్‌జోషి 'సాక్షి'కి తెలిపారు. కమిషనరేట్ పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశారు.

టీఎస్ఎస్పీ ఆర్ఐ దయాశీలకు..

ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న కారుకొండ దయాశీలకు మంచి పేరుంది. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ దయాశీలను కేంద్ర హోం శాఖ గుర్తించి ఐపీఎం అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డును దయాశీల త్వరలోనే డైరెక్టర్ ఆఫ్ జనరల్ చేతులమీదుగా అందుకోనున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా తనకు ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని దయాశీల తెలిపారు. మెడల్ దక్కేందుకు సహకారం అందించిన టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డితోపాటు రాష్ట్ర పోలీస్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్న యువకుడి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం: యువతి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించిన యువకుడిని గీసుకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి తెలిపారు. ఖిలా వరంగల్ మండలం దూబకుంట గ్రామానికి చెందిన జన్ను విజయ్‌కుమార్ ఏడాదిగా అదే గ్రామానికి చెందిన యువతితో చాటింగ్ చేస్తున్నాడు. ఈ చాటింగ్ వ్యవహారం సదరు యువతి అక్క దృష్టికి రావడంతో ఆమె అతడిని మందలించింది. కక్షగట్టిన విజయ్ యువతి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన ఫొటోలు, అసభ్యకరమైన మెసేజ్‌లను బాధితురాలి ఫోన్‌కు పంపించాడు. దీంతోపాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కమిషనరేట్ సైబర్ క్రైం విభాగం సహకారంతో చేపట్టిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి, ఎస్సై వెంకన్న, కానిస్టేబుళ్లు కిషోర్, సంపత్‌ను అభినందించారు.

పచ్చని సిరి.. పర్వతగిరి

● కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు
● నేటి నుంచి శివాలయ పునఃప్రతిష్ఠ


పర్వతాల శివాలయం


జలకళను సంతరించుకున్న పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్


చెరువులో ఏర్పాటు చేసిన బోటింగ్

పర్వతగిరి: ఓవైపు ఆధ్యాత్మికం.. మరో వైపు ఆహ్లాదం. ఇంకోవైపు పర్యాటకం. ఇలా పచ్చని సిరిగల పర్వతగిరి భక్తులను, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. వరంగల్ జిల్లా కేంద్రానికి 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్వతగిరి ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి పెద్ద చెరువు రిజర్వాయర్ సుమారు 500 ఎకరాల విస్తీర్ణానికి సాగు నీరందిస్తోంది. రిజర్వాయర్‌కు ఆనుకుని ఇరువైపులా పంచగుట్టలున్నాయి. అందులో చెన్నకేశవ గుట్ట (ప్రస్తుతం పర్వతాల గుట్ట) ఆగుట్టపై శివాలయం విరాజిల్లుతోంది. చెరువులో టూరిజం శాఖ రెండు బోట్లను ఏర్పాటు చేసింది. గుడికి ఇరువైపులా పచ్చని పంట పొలాలు చూపుతిప్పుకోనివ్వవు. అక్కడే కొలువైన పెద్దమ్మ, గంగమ్మ, మైసమ్మతల్లులు భక్తులకు దీవెనలందిస్తున్నాయి. త్వరలో కంఠమహేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు. కల్లెడలో కొలను వెంకటేశ్వస్వామి ఆలయం అక్కడే సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన కల్లెడ గడీ. ఇవన్నీ పర్యాటకులను రారమ్మని ఆహ్వానిస్తున్నాయి.

నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్ఠ

పర్వతగిరి శివాలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. రోజంతా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా.. సాయంత్రం 6గంటలకు అనంత లక్ష్మమ్మ, 6.30 నుంచి 10గంటల వరకు రజని సిస్టర్స్‌తో గాన కచేరి నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 5గంటలకు మేలు కొలుపు నుంచి మొదలుకొని సాయంత్రం 6గంటల వరకు పూజా కార్యక్రమాలుంటాయి. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు మధుప్రియ గానామృతం ఉంటుంది. 28న ముఖ్య అతిథులుగా ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, శ్రీశివక్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి పాల్గొంటారు. సాయంత్రం 6.30 గంటలకు సినీ గాయకురాలు సునీత పాటల కార్యక్రమం ఉంటుంది. కాగా.. ఈమూడ్రోజులు ఉదయం 11గంటల నుంచి 4గంటల వరకు 400 మంది విద్యార్థులతో వందేమాతరం, క్లాప్స్‌తో శివ నామస్మరణ (ప్రతీ రెండు గంటలకు ఒకసారి) నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు రానున్నారు.

అధిక సంఖ్యలో భక్తులు రావాలి..

పర్వతాల శివాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈమేరకు శివాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పర్వతగిరి చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా పాల్గొని శివుడి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయ పునఃప్రతిష్ఠ కారకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, జెడ్పీటీసీ సింగ్‌లాల్, గ్రామసర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సర్వర్, రైతు సమితి మండల కో–ఆర్డినేటర్ చిన్నపాక శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు గొర్రె దేవేందర్, మోటపోతుల మనోజ్‌గౌడ్, మామునూరు ఏసీపీ నరేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'సదరం' పేరిట నకిలీ వైద్యుల దోపిడీ

● రిపోర్టర్‌నని ఓ వ్యక్తి ఆరా తీయడంతో పరార్


నకిలీ వైద్యుడి గుర్తింపు కార్డు

గూడూరు: 'మీ గ్రామంలోనే సదరం క్యాంపులు నిర్వహిస్తున్నాం. వెంటనే సర్టిఫికెట్లు ఇస్తాం' అని ఓ ఇద్దరు నకిలీ వైద్యులు డబ్బులు దండుకుని పరారయ్యారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పానుగోడు, రాములుతండా, చిర్రకుంట తండాల్లో ఈఘటన జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావికి చెందిన ఎండి.దస్తగిరితో పాటు మరొకరు డాక్టర్‌గా గుర్తింపు కార్డులు మెడలో వేసుకొని మంగళవారం చిర్రకుంట తండాకు వచ్చారు. తండాలో వృద్ధులు, వికలాంగులను ఒక చోట చేర్చి సదరం క్యాంపు, సర్టిఫికెట్ల ఉపయోగం గురించి అవగాహన కల్పించారు. మీ ఊరిలోనే క్యాంపు నిర్వహిస్తామని, ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.8 వేలు అవుతుందని, ముందుగా రూ.3 నుంచి రూ.5 వందలు ఇవ్వాలనడంతో నమ్మిన కొందరు గ్రామస్తులు డబ్బులిచ్చారు. పానుగోడులో క్యాంపు నిర్వహిస్తామని, డబ్బులిచ్చిన వ్యక్తులు పానుగోడుకు రావాలని వెళ్లిపోయారు. బుధవారం పానుగోడు చేరుకున్న ఆ ఇద్దరు వ్యక్తులు సర్పంచ్ నలమాస వెంకన్న, పంచాయతీ కార్యదర్శికి తమ ఐడీ కార్డులు, పత్రాలు చూపి ఊళ్లో డప్పు చాటింపు చేయించారు. ఈసమాచారం విన్న గ్రామానికి చెందిన ఓవ్యక్తి మండల కేంద్రంలోని ఐకేపీ ఏపీఎం రవీందర్‌కు సమాచారం అందించాడు. గ్రామాల్లో సదరం క్యాంపు పెట్టడమేంటి, తనకు సమాచారం లేకుండా జరుగుతుందా? జిల్లా అధికారులను తెలుసుకుంటానని చెప్పి ఏపీఎం ఆలస్యం చేశాడు. యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌నని ఓ వ్యక్తి నకిలీ వైద్యుడి మెడలోని ట్యాగ్‌ను ఫొటో తీసేందుకు యత్నించాడు. దీంతో వారికి భయమేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆతర్వాత వారు నకిలీ వైద్యులని ఏపీఎం రవీందర్ చెప్పారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి గ్రామంలోని వీధుల్లో వారి కోసం గాలిస్తుండగా.. మరో వీధి నుంచి నకిలీ వైద్యులు నర్సంపేట మార్గం వైపు పారిపోయారు.

నీ వల్లే డబ్బులు పోయాయి!

'నీ వల్లే డబ్బులు పోయాయి. సర్టిఫికెట్ రాలేదు. నువ్ రాకపోతే వాళ్లు సర్టిఫికెట్లు ఇచ్చే వాళ్లు' అంటూ నకిలీ వైద్యులకు డబ్బులు చెల్లించిన కొందరు గ్రామస్తులు రిపోర్టర్ అని చెప్పి ఐడీ కార్డు ఫొటో తీసిన వ్యక్తితో గొడవకు దిగినట్లు సమాచారం. పోలీసులు వచ్చి మీరంతా నకిలీ వైద్యుల చేతిలో మోసపోయారని చెప్పడంతో గ్రామస్తులు ఖంగుతిన్నారు. చిర్రకుంటతండా, రాములుతండా, పానుగోడు గ్రామాల్లో మొత్తం రూ. 50 వేల వరకు డబ్బులు దండుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. ఐడీ కార్డులు చూపెట్టడంతో అర్హులకు పింఛన్‌లు వస్తాయనుకుని నమ్మినట్లు తెలిపారు.

ఘనంగా శుద్ధి పండుగ

● మేడారం, కన్నెపల్లిలో ప్రత్యేక పూజలు


డోలు వాయిద్యాలతో సమ్మక్క గుడికి వస్తున్న పూజారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి శుద్ధి పండుగ పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సమ్మక్క పూజారులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి అమ్మవారి గుడికి వెళ్లి శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి పూజారి కొక్కెర కృష్ణయ్య, దూపవడ్డ నాగేశ్వర్‌రావు దూపం పట్టుకొని డోలు వాయిద్యాలతో పూజారులు సమ్మక్క గుడికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గుడిలో ఆడపడుచులు అమ్మవారి శక్తి పీఠం గద్దెను ముగ్గులతో అలంకరించారు. గుమ్మాల వద్ద ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు దూప దీపాలు వెలిగించి, యాటను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం అడవి నుంచి కొత్తగా తీసుకువచ్చిన ఎట్టిగడ్డిని సమ్మక్క గుడి ఈశాన్య మూలకు ఉంచారు.

కన్నెపల్లిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో కూడా సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు పూజారులు గుడిని శుద్ధి చేసి సారలమ్మ వడ్డెరలను పసుపు, కుంకుమలు పెట్టి అలంకరించారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారి గుడి ఆవరణలో ముగ్గులు వేసి అలంకరించారు. ఈకార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్ధబోయిన మహేశ్, లక్ష్మణ్‌రావు, బొజారావు, జనార్దన్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

స్కూలుకెళ్లమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

● మృతదేహంతో ఆస్పత్రి ఎదుట నిరసన
● ఆస్పత్రిపై దాడి.. పోలీసుల రంగప్రవేశం


నవ్య (ఫైల్)


ఆస్పత్రి ఎదుట బాలిక మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

కాశిబుగ్గ: స్కూలుకెళ్లమని తల్లిదండ్రులు మందలించినందుకు నగరంలోని చింతల్ ఆర్ఎస్‌నగర్‌కు చెందిన ముత్యాల నవ్య (15) ఆత్మహత్యకు యత్నించి బుధవారం మృతి చెందింది. నవ్య నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం ఆమె తల్లిదండ్రులు స్కూలుకు వెళ్లమని మందలించారు. మనస్తాపం చెందిన నవ్య ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన ఆమె తల్లిదండ్రులు దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాలిక చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలిక మృతి చెందిందని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి అద్దాలు ధ్వంసం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు బాధితులను సముదాయించి ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈసందర్భంగా వరంగల్ ఏసీపీ గిరికుమార్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో చికిత్సలోపం జరిగిందని అనుమానం ఉంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. కానీ ఆస్పత్రిపై దాడులు చేయడం సరికాదని, అమ్మాయి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నదన్న దానిపై కూడా విచారణ జరిపిస్తామన్నారు. ఈవిషయంపై ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుతూ.. కొన ఊపిరితో ఉన్న బాలికకు సీపీఆర్ చేసి కుటుంబీకులతో చర్చించి వైద్యం చేశామని, ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు. అయినప్పటికీ బాలిక కుటుంబ సభ్యులు రాత్రి వరకు ఆందోళను కొనసాగించారు.

బాలిక తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతూ జీవిత ఖైదీ మృతి

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన జీవిత ఖైదీ గడ్డం శ్రీను బుధవారం మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. 2007 జూలైలో అదనపు సెషన్ జడ్జి యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో అతడు జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 24న అనారోగ్య కారణాలతో అతడిని ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకొచ్చారు. కాగా.. చికిత్స పొందుతూ బుధవారం శ్రీను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

అదుపుతప్పి డీసీఎం బోల్తా

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్: వరంగల్ నుంచి నర్సంపేటకు లోడుతో వెళ్తున్న డీసీఎం పట్టణ శివారులోని బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈఘటనలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో నెలన్నర శిశువు మృతి


శిశువు మృతదేహం

ఖానాపురం: మండలంలోని కొత్తూరులో బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో నెలన్నర శిశువు మృతి చెందింది. నెక్కొండ మండలం దీక్షకుంట్ల గ్రామానికి చెందిన అంకేశ్వరపు రామకృష్ణ, రచన దంపతులకు ఇటీవల ఆడశిశువు జన్మించింది. ఈక్రమంలో రచన కొత్తూరులోని అమ్మమ్మ ఇంటి వద్దకు వచ్చి ఉంది. కాగా..45 రోజుల పాపకు గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌కు తీసుకెళ్లి నెల ఇంజెక్షన్‌లు వేయించారు. సుమారు గంటకు పైగా సెంటర్‌లోనే ఉన్నారు. ఆతర్వాత శిశువును ఇంటికి తీసుకెళ్లిన తర్వాత అస్వస్థతకు గురయ్యింది. కుటుంబ సభ్యులు గమనించి నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. వైద్య పరీక్షలు చేయగా.. శిశువు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు రచన–రామకృష్ణ తెలిపారు. కాగా.. ఇంజెక్షన్‌లు వికటించడం వల్లే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై పీహెచ్‌సీ వైద్యులు భూపేశ్‌ను వివరణ కోరగా.. ఇంజెక్షన్‌లు వికటించి ఉండకపోవచ్చని, ఘటనపై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కాగా.. శిశువు కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్ భూస రమఅశోక్‌యాదవ్ పరామర్శించారు.

రోడ్లపై డబ్బుల వసూలు


ద్విచక్ర వాహనదారుడిని డబ్బులడుగుతున్న మహిళ

డోర్నకల్: స్థానిక మెయిన్ రోడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో బుధవారం కొంతమంది యువతులు, మహిళలు బైక్‌లను అడ్డగించి డబ్బులు వసూలు చేశారు. రాజస్థాన్‌కు చెందిన కొంతమంది యువతులు, మహిళలు కుటుంబాలతో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. తర్వాత మహిళలు, యువతులు గుంపులుగా విడిపోయి పలు వీధుల్లో తిరుగుతూ రోడ్లపై ద్విచక్ర వాహనదారులను అడ్డగించి డబ్బులు వసూలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రైల్వే స్టేషన్ ఆవరణకు చేరుకోగా.. మహిళలు, యువతుల కుటుంబ సభ్యులతో కలిసి రైల్లో వెళ్లిపోయారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న మల్లారెడ్డి, అయిలయ్య

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల 3వ, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్ని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య కళాశాలలో బుధవారం విడుదల చేశారు. ఈనెల 13న పరీక్షలు పూర్తికాగా.. కేవలం 12 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేశారు. 3వ సెమిస్టర్‌లో 49.90శాతం, 5వ సెమిస్టర్‌లో 73.42శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్ కోసం ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.275లు చెల్లించి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రాజు, గిరిప్రసాద్, కిష్టయ్య, విభాగాల అధిపతులు అంజన్‌రావు, చిర్ర రాజు, సురేశ్, రాజశేఖర్, రమేశ్, ప్రసాద్, పరహాఫాతిమా, ఆదిరెడ్డి పాల్గొన్నారు.